సాక్షి భద్రాద్రి కొత్తగూడెం

ఆదివారం । 24 । ఆగస్టు । 2025



బురదే మిగిలింది..

నిన్నా మొన్నటి వరకు పచ్చగా కళకళలాడిన పంటలు గోదావరి వరదల పుణ్యమా అని బురదమయంగా మారాయి. 8లో



పెండింగ్ పనులు పూర్తి చేయాలి

ఇల్లెందు కోర్టులో పెండింగ్ పనులు పూర్తి చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పాటిల్ వసంత్ సూచించారు. 8లో

గరిష్టం / కనిష్టం 31° / 24°

వాతావరణం

జిల్లాలో ఆదివారం సాధారణఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమవుతుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు సువర్ణ తులసీ అర్చన



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి శనివారం సువర్ణ తులసీ అర్చన వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం జరిపించారు. అనంతరం స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ వేడుకను శాస్త్రోక్తంగా నిర్వహించారు.

నేటి నుంచి భాద్రపద మాసోత్సవాలు..

భద్రాచలంటౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానంలో ఆదివారం నుంచి సెప్టెంబర్ 21వరకు భాద్రపద మాసోత్సవాలు నిర్వహించనున్నట్లు ఈఓ ఎల్.రమాదేవి తెలిపారు. సెప్టెంబర్ 7న చంద్రగ్రహణం కారణంగా మధ్యాహ్నం ఒంటి గంటకు ఆలయ తలుపులు మూసి 8వ తేదీ తెల్లవారుజామున 3 గంటలకు తిరిగి తెరుస్తామని, ఆ తర్వాత ప్రత్యేక పూజలు ఉంటాయని పేర్కొన్నారు. 15వ తేదీన శ్రీ వైష్ణవ కృష్ణాష్టమి సందర్భంగా స్వామివారు శ్రీకృష్ణావతారంలో భక్తులకు దర్శనమిస్తారని వెల్లడించారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి

ఐటీడీఏ పీఓ రాహుల్



మహిళలతో మాట్లాడుతున్న పీఓ రాహుల్

చర్ల: మహిళలు స్వశక్తితో ఎదగాలని, ఇందుకోసం చిన్న తరహా పరిశ్రమల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ అన్నారు. మండలంలోని ఆర్.కొత్తగూడెం పంచాయతీ పరిధి సున్నగుంపులో మహిళలు అటవీ ఉత్పత్తులతో తయారు చేసే తినుబండారాలను శనివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వశక్తితో ఎదిగేందుకు ముందుకొస్తున్న మహిళా సంఘాలకు అన్ని విధాలా సహకరిస్తామని, అవసరమైన ఆర్థిక సాయం అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్, ఐటీసీ మేనేజర్ చంగల్‌రావు, ప్యాకింగ్, డిజైనింగ్ కోఆర్డినేటర్ బేగ్, మహిళా సభ్యులు సమ్మక్క, మునెమ్మ, శ్రీదేవి, రమాదేవి, శిరీష, ఈశ్వరి, స్వాతి పాల్గొన్నారు.

జ్వరాలు వ్యాప్తి చెందకుండా చూడండి..

ఏజెన్సీలో జ్వరాలు వ్యాప్తి చెందకుండా చర్యలు చేపట్టాలని పీఓ రాహుల్ సూచించారు. శనివారం ఆయన స్థానిక ప్రభుత్వ ఆస్పత్రిని సందర్శించారు. పేషెంట్లతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రికార్డులన్నీ సక్రమంగా నమోదు చేయాలని, రక్త పరీక్ష శాంపిళ్లను ఎప్పటికప్పుడు టీ హబ్‌లకు పంపించాలని ఆదేశించారు. జ్వరాలు ప్రబలే గ్రామాలను గుర్తించి వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలన్నారు.

ఏ మలుపు తిరుగునో?

- భద్రాచలం నుంచి బీఆర్ఎస్ తరఫున ఎన్నికైన తెల్లం వెంకట్రావు
- గెలిచిన తర్వాత కాంగ్రెస్ గూటికి..
- పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలని బీఆర్ఎస్ ఫిర్యాదు
- ఎట్టకేలకు మొదలైన నోటీసుల పర్వం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: ఒక పార్టీ గుర్తుపై గెలిచి మరో పార్టీలో చేరిన ఎమ్మెల్యేలకు అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ నోటీసులు జారీ చేస్తున్నారు. దీంతో భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు రాజకీయ భవితవ్యం ఏ మలుపు తిరుగుతుందోననే చర్చ మొదలైంది. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అనుచరుడిగా పేరున్న వెంకట్రావు 2014 నుంచి రాజకీయాల్లో కొనసాగుతున్నారు. ఒకసారి ఎంపీగా, రెండుసార్లు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి 2023 నవంబర్‌లో జరిగిన ఎన్నికల్లో భద్రాచలం అసెంబ్లీ స్థానం నుంచి బీఆర్ఎస్ అభ్యర్థిగా గెలుపొందారు.

జిల్లా నుంచి ఒకే ఒక్కడు..

తెలంగాణ అసెంబ్లీకి 2023 నవంబర్‌లో ఎన్నికలు జరగగా అంతకు కొన్ని నెలల ముందే (ఆగస్టులో) తెల్లం వెంకట్రావు కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్‌లో చేరారు. ఆ వెంటనే గులాబీ పార్టీ తరఫున భద్రాచలం నుంచి పోటీ చేశారు. జిల్లాలోని ఐదు అసెంబ్లీ స్థానాల్లో మూడు చోట్ల కాంగ్రెస్, కొత్తగూడెంలో ఆ పార్టీ బలపర్చిన సీపీఐ అభ్యర్థి గెలవగా.. అప్పటివరకు కాంగ్రెస్ సిట్టింగ్ స్థానంగా ఉన్న భద్రాచలం మాత్రం బీఆర్ఎస్ ఖాతాలో పడింది. డీసీసీ అధ్యక్షుడి హోదాలో కాంగ్రెస్ తరఫున పోటీ చేసిన సిట్టింగ్ ఎమ్మెల్యే పొదెం వీరయ్యపై తెల్లం వెంకట్రావు విజయం సాధించి సంచలనం సృష్టించారు. ఆఖరి నిమిషంలో పార్టీ మారి ఫాయిదా దక్కించుకున్న రాజకీయ చాణక్యుడిగా పిలిపించుకున్నారు.

న్యాయస్థానాన్ని ఆశ్రయించిన బీఆర్ఎస్..

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ముగిసిన ఆరు నెలల్లోపే బీఆర్ఎస్ నుంచి ఏకంగా పది మంది ఎమ్మెల్యేలు కాంగ్రెస్ క్యాంప్‌లో చేరిపోయారు. దీంతో పార్టీ మారిన ఎమ్మెల్యేలపై వేటు వేయాలంటూ ముందుగా అసెంబ్లీ స్పీకర్‌ను, ఆ తర్వాత హైకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించింది. అనేక మలుపుల తర్వాత ఈ అంశం సుప్రీంకోర్టుకు చేరింది. దీంతో బీఆర్ఎస్ ఫిర్యాదుపై విచారణ చేపట్టాలంటూ సుప్రీంకోర్టు సూచించింది. ఈ మేరకు విచారణకు రావాల్సిందిగా పార్టీ మారిన ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ నోటీసులు జారీ చేస్తున్నారు.



లేఖ అందలేదు

ఇంకా స్పీకర్ పంపిన లేఖ అందలేదు. లేఖ వచ్చిన తర్వాత అందులో ఉన్న విషయం ఆధారంగా కుటుంబసభ్యులు, అభిమానులు, పార్టీ పెద్దలతో సంప్రదించి స్పందిస్తా. అప్పటి వరకు నియోజకవర్గ అభివృద్ధిపైనే దృష్టి సారిస్తా.

– తెల్లం వెంకట్రావు, భద్రాచలం ఎమ్మెల్యే

'కారు' దిగి కాంగ్రెస్‌లోకి..

ఎన్నికల ఫలితాలు వెలువడినప్పటి నుంచే తెల్లం వెంకట్రావు కాంగ్రెస్ పార్టీలోకి వెళ్తారనే ప్రచారం జరిగింది. అయితే ఎప్పటికప్పుడు ఆయన ఆ ప్రచారాన్ని ఖండిస్తూ బీఆర్ఎస్‌లోనే కొనసాగుతానని చెబుతూ వచ్చారు. ఇక భద్రాచలం ఎమ్మెల్యే బీఆర్ఎస్‌లోనే కొనసాగుతారని అంతా అనుకుంటుండగా 2024 ఏప్రిల్ 7న సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. నియోజకవర్గ అభివృద్ధి కోసమే అధికార పార్టీలో చేరాల్సి వచ్చిందని ఆ సందర్భంగా ఆయన తెలిపారు.

గణేష్ ఉత్సవాలు ప్రశాంతంగా నిర్వహించాలి

కలెక్టర్ జితేష్ వి పాటిల్



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్, పక్కన ఎస్పీ రోహిత్‌రాజు, అదనపు కలెక్టర్ వేణుగోపాల్

సూపర్‌బజార్(కొత్తగూడెం): గణపతి నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. వినాయక చవితి ఉత్సవాల నిర్వహణ, నిమజ్జన ఏర్పాట్లపై కలెక్టరేట్‌లో శనివారం ఆయన పలు శాఖల సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉత్సవ కమిటీల వారు గణేష్ మండపాలను విధిగా రిజిస్ట్రేషన్ చేయించాలని సూచించారు. మండపాలకు ఏర్పాటుచేసే విద్యుత్ కోసం ఆ శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని స్పష్టం చేశారు. ఎలాంటి ప్రమాదాలు జరుగకుండా రక్షణ చర్యలపై విద్యుత్ అధికారులు పర్యవేక్షించాలన్నారు. జిల్లాతో పాటు ఇతర ప్రాంతాల నుంచి కూడా విగ్రహాలు నిమజ్జనానికి వచ్చే అవకాశం ఉన్నందున అధికారులు భద్రతా చర్యలను పటిష్టం చేయాలని, గుర్తించిన ప్రాంతాల్లోనే నిమజ్జనం చేసేలా చూడాలని, అవసరమైన రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని ఆదేశించారు. వినాయక నిమజ్జనానికి వినియోగించే వాహనాలకు ముందుగా రవాణాశాఖ అధికారి నుంచి ధ్రువీకరణ తీసుకోవాలని అన్నారు. ప్రతీ గణేష్ మండపం వద్ద అవసరమైన మేరకు బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. గణేష్ ఉత్సవాలు, నిమజ్జనం సందర్భంగా ఎలాంటి రెచ్చగొట్టే అంశాల జోలికి వెళ్లొద్దని, శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. భక్తులకు అందించే స్వామి వారి ప్రసాదాలకు ప్లాస్టిక్ వస్తువులు వినియోగించొద్దని, పర్యావరణ పరిరక్షణకు సహకరించాలని సూచించారు. వీలైనంత వరకు మట్టి గణపతి విగ్రహాలను పూజించాలని అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో జిల్లాలోని మున్సిపాలిటీల్లో ఉచితంగా మట్టి విగ్రహాల పంపిణీకి ఏర్పాట్లు చేశామన్నారు. సమావేశంలో ఎస్పీ రోహిత్‌రాజ్, భద్రాచలం సబ్‌కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, ఏఎస్పీ విక్రాంత్‌కుమార్ సింగ్, అదనపు కలెక్టర్లు డి.వేణుగోపాల్, విద్యాచందన, డీపీఓ చంద్రమౌళి, డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి, మిషన్ భగీరథ ఈఈ తిరుమలేష్, కొత్తగూడెం ఆర్డీఓ మధు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

నవరాత్రి వేడుకలకు పటిష్ట బందోబస్తు..

కొత్తగూడెంఅర్బన్: గణపతి నవరాత్రి వేడుకలకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఎస్పీ రోహిత్ రాజు పోలీస్ అధికారులకు సూచించారు. తన కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు నియమ నిబంధనల గురించి వివరించాలని, శోభాయాత్ర సమయంలో డీజేలు, టపాసుల నిషేధంపై అవగాహన కల్పించాలని చెప్పారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో పెండింగ్ కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, డీఎస్పీలు రెహమాన్, సతీష్ కుమార్, చంద్రభాను, రవీందర్ రెడ్డి, మల్లయ్యస్వామి పాల్గొన్నారు.

21 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు

కొత్తగూడెంఅర్బన్: జిల్లాలోని 21 పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం కానున్నాయని డీఈఓ నాగలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా అందరికీ నాణ్యమైన విద్య అందించేందుకు జిల్లాలో 21 స్కూళ్లను ఎంపిక చేశామని పేర్కొన్నారు. నాలుగేళ్లు, ఆపైన వయసు గల పిల్లలు ప్రీ ప్రైమరీల్లో ప్రవేశాలు పొందవచ్చని తెలిపారు. ఆయా విద్యార్థులకు నిష్ణాతులైన శిక్షకులతో తరగతులు నిర్వహించడంతో పాటు ఉచితంగా యూనిఫాం, టై, బెల్ట్, షూ అందిస్తామని వివరించారు. తమ చిన్నారులను చేర్పించే తల్లిదండ్రులు సంబంధిత ప్రధానోపాధ్యాయులను సంప్రదించాలని సూచించారు.

మైనార్టీ కళాశాల్లో ప్రవేశానికి దరఖాస్తులు

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి జిల్లాలోని తెలంగాణ మైనార్టీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాలల ఆర్‌సీఓ ఎం.జే.అరుణకుమారి తెలిపారు. మైనార్టీ(ముస్లింలు, క్రైస్తవులు, పార్సీలు, జైనులు, సిక్కులు) విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. ఉమ్మడి జిల్లాలోని కాలేజీల్లో ఎంపీసీ, బైపీసీ ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు టీఎంఆర్ జూనియర్ కళాశాలల్లో చేరడానికి అర్హులని తెలిపారు. ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకుంటే 29న నిర్వహించే పరీక్ష ద్వారా ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. వివరాల కోసం ఖమ్మం(బాలికలు), కొత్తగూడెం (బాలురు)లోని సీఓఈ కేంద్రాల్లో లేదా 91543 65017, 78931 16918 నంబర్లలో సంప్రదించాలని అరుణకుమారి సూచించారు.

సాహసోపేత టూరిజంగా 'రథంగుట్ట'



రథంగుట్ట ప్రాంతాన్ని పరిశీలిస్తున్న జిప్‌లైన్ బృందం



కిన్నెరసాని జలాశయ ద్వీపం వద్ద పరిశీలిస్తున్న అధికారులు

మణుగూరురూరల్ : మండలంలోని రథంగుట్ట ప్రాంతం సాహసోపేత టూరిజం స్పాట్‌గా ప్రత్యేకత చాటుకుంటుందని జిప్‌లైన్ అడ్వెంచర్ ప్రతినిధులు అన్నారు. శనివారం వారు రథంగుట్ట ప్రాంతాన్ని పరిశీలించారు. అన్ని ఆధునిక, సాంకేతిక పరికరాలు, భద్రతా ప్రమాణాలు అమలు చేస్తూ పర్యావరణానికి నష్టం కలిగించకుండా రథంగుట్ట ప్రాజెక్ట్‌ను ప్రత్యేక టూరిజం స్పాట్‌గా రూపకల్పన చేయొచ్చని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ఏర్పాటుతో స్థానికులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని, హస్తకళ, చిన్న పరిశ్రమలకు మార్కెట్ అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. పర్యాటకుల కోసం సమాచార, శిక్షణ కేంద్రాలు కూడా ఏర్పాటు చేస్తామన్నారు. రథంగుట్ట పరిసరాలు ప్రకృతి అందాలతో ప్రత్యేక ఆకర్షణగా మారుతాయని, ప్రాంతీయ, రాష్ట్రీయ, దేశీయ పర్యాటకులకు పరిచయం చేయొచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధికారులతో పాటు మణుగూరు ఎఫ్ఆర్ఓ ఉపేందర్, ఎంపీడీఓ టి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో రోప్ వేకు కసరత్తు..

పాల్వంచరూరల్ : పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానిలో అద్దాలమేడ నుంచి జలాశయం మధ్యలో ఉన్న చిన్న ద్వీపం వరకు రూ.25 లక్షల వ్యయంతో సుమారు అర కిలోమీటర్ మేర సింగిల్ రోప్ వే(జిప్ లైన్) ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. ఈ మేరకు పుణె నుంచి నెయిల్ అడ్వెంచర్ పంకజ్ కుమేరియా బృందం శనివారం కిన్నెరసానిలో పర్యటించింది. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ.. కేరళ, మయన్మార్, డార్జిలింగ్‌లో ఎత్తయిన కొండల మధ్య పొడవైన జిప్‌లైన్‌లు ఉన్నాయని, కిన్నెరసానిలోనూ జిప్‌లైన్ రోప్‌వే ఏర్పాటు చేస్తే పర్యాటకులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని అన్నారు. జిప్‌లైన్ ఏర్పాటుకు సంబంధించిన నివేదికను కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డీవైఎస్‌ఓ పరంధామరెడ్డి, ఎంపీడీఓ కె.విజయభాస్కర్‌రెడ్డి, ఎంపీఓ చెన్నకేశవరావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలకు సిద్ధం కావాలి



మాట్లాడుతున్న అంజిరెడ్డి

బూర్గంపాడు: తెలంగాణ మలిదశ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయాలని ఉద్యమకారుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సోమా అంజిరెడ్డి డిమాండ్ చేశారు. సారపాకలో శనివారం జరిగిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మలిదశ ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం, పెన్షన్, హెల్త్‌కార్డులు ఇస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. హామీలు అమలు కాకుంటే ఉద్యమాలకు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు. ఉద్యమకారుల పిల్లలకు ఉచితంగా ఉన్నత చదువులు, ఉపాధి, ఉద్యోగావకాశాలు కల్పించాలని, తమపై పెట్టిన కేసులు పూర్తిగా ఎత్తివేయాలని అన్నారు. సమావేశంలో మలిదశ ఉద్యమకారులు తోడేటి సత్యనారాయణ, పొడియం నరేందర్, బాగి వెంకట్రావు, సోమయ్య, పేరాల శ్రీనివాసరావు, నల్లమోతు సురేష్, దాసరి సాంబయ్య, గుర్రాల సుదర్శన్, కొండగట్టు ప్రసాద్, సుబ్బారావు పాల్గొన్నారు.

గోదావరి కలుషితం



గోదావరి నదిలో కలుస్తున్న వ్యర్థాలు

భద్రాచలంఅర్బన్: భద్రాచలం నాలుగు రాష్ట్రాలకు కూడలి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఒడిశా రాష్ట్రాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం తరచూ భద్రాచలం వస్తుంటారు. ఈ క్రమంలో పట్టణంలో ఏర్పడే చెత్తను గత కొన్నేళ్లుగా భద్రాచలం గోదావరి నదీ తీరాన ఉన్న అనధికారిక డంపింగ్ యార్డులోనే పడేస్తున్నారు. రెండు, మూడు రోజుల క్రితం భద్రాచలం గోదావరి నదికి వరద పోటు కారణంగా ఆ చెత్త అంతా కరకట్ట చుట్టూ ఒడ్డుకు చేరుకుంది. పట్టణంలో గల అన్ని కాలనీల్లోని నివాస గృహాల నుంచి వచ్చే చెత్తతో పాటు అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల నుంచి వచ్చే వేస్టేజీని ఇదే ప్రాంతంలో వేస్తుంటారు. ఇప్పుడు అదే చెత్త గోదావరి నదిలో కలిసి నీరు కలుషితం అవుతోంది. గోదావరి తీరం డంపింగ్ యార్డును తలపిస్తోంది. ఈ సమస్య ప్రతీ సంవత్సరం వచ్చే గోదావరి వరదల సమయంలో ఎదురవుతూనే ఉన్నా.. పరిష్కారానికి అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోవడం లేదు. ఇప్పటికైనా స్పందించి ఆ ప్రాంతంలో చెత్తను వేయకుండా తగు చర్యలు తీసుకోవాలని ఇటు స్థానికులు, అటు రామయ్య భక్తులు కోరుతున్నారు.

'మూణ్నెల్ల' ముచ్చటేనా?

- గ్యాస్ సబ్సిడీ అందక 'మహాలక్ష్మి' వినియోగదారుల ఇక్కట్లు
- రూ.500కు సిలిండర్ ఏమైందంటున్న లబ్ధిదారులు
- మొదటి మూడు నెలల వరకే జమైన రాయితీ



జిల్లాలో గ్యాస్ వినియోగదారులు

మొత్తం కనెక్షన్లు	4,69,075
సింగిల్ కనెక్షన్లు	2,41,175
డబుల్ కనెక్షన్లు	98,868
దీపం పథకం కింద	53,405
సీఎస్ఆర్ కనెక్షన్లు	2,465
పీఎంయూవై	73,162

పాల్వంచరూరల్: మహాలక్ష్మి లబ్ధిదారులకు వంట గ్యాస్ సిలిండర్ల రాయితీ డబ్బులు రావడం లేదని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే మహాలక్ష్మి పథకం కింద తెల్లరేషన్ కార్డు ఉన్న గ్యాస్ వినియోగదారులకు రూ.500కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చింది. ఆ తర్వాత ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆరు గ్యారంటీల్లో భాగంగా ఈ పథకాన్ని గతేడాది ఫిబ్రవరి 27న ప్రారంభించారు. అంతకుముందే ప్రజాపాలన సభల్లో గ్యాస్ రాయితీ పథకానికి దరఖాస్తులు స్వీకరించారు. జిల్లా వ్యాప్తంగా రెండు లక్షల మందికి పైగా దరఖాస్తు చేసుకోగా, అందులో 1,54,633 మందిని లబ్ధిదారులుగా గుర్తించారు. వీరిలో అత్యధికంగా బూర్గంపాడు మండలంలో 10,276 మంది, అశ్వారావుపేటలో 8,312, ఇల్లెందు మండలంలో 8,662, పాల్వంచ మున్సిపాలిటీ పరిధిలో 8,164 మంది ఉండగా.. అత్యల్పంగా ఆళ్లపల్లి మండలంలో 1,344 మంది, గుండాలలో 2,205, కరకగూడెంలో 2,513, అన్నపురెడ్డిపల్లి మండలంలో 3,540 మంది ఉన్నారు. వీరిలో చాలా మంది మొదటి మూడు నెలల వరకే సబ్సిడీ డబ్బు బ్యాంకు ఖాతాల్లో జమైందని, ఆ తర్వాత రావడం లేదని చెబుతున్నారు. ప్రస్తుతం సిలిండర్ ధర రూ.892 ఉండగా కేంద్ర ప్రభుత్వం రూ.21 రాయితీ ఇస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం రూ.371 సబ్సిడీ ఇవ్వాల్సి ఉండగా.. గత ఐదారు నెలలుగా రాష్ట్ర సబ్సిడీ అందడం లేదని, ఎందుకు జమ చేయడం లేదని వినియోగదారులు ప్రశ్నిస్తున్నారు.

మూడు సిలిండర్లకే వచ్చాయి..



నేను గతేడాది ఫిబ్రవరి నుంచి ఎనిమిది గ్యాస్ సిలిండర్లు తీసుకున్నా. సిలిండర్ రూ.854 ఉన్నప్పుడు మూడు సార్లు రూ.334.62 చొప్పున బ్యాంకులో జమయ్యాయి. ఆ తర్వాత పడలేదు.

– మత్తె గంగమ్మ, బస్వతారక కాలనీ

రాయితీ డబ్బు రావడం లేదు..



రూ.500కే గ్యాస్ పథకానికి నన్ను ఎంపిక చేశారు. రూ.892 పెట్టి కొంటున్నా రాయితీ డబ్బులు రావడం లేదు. కేంద్రం ఇచ్చే రూ.21 ఖాతాలో పడుతున్నాయి. అధికారులను అడిగితే నాకు రాయితీ పథకం నిలిచిపోయిందన్నారు.

– గంగ, వీరునాయక్ తండా

ఒక్కసారి కూడా రాలే



మహాలక్ష్మి పథకం కింద ఎంపికయ్యానని తెలిసి సంతోషపడ్డా. కానీ ఇంతవరకు రాయితీ డబ్బులు జమ కాలేదు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం లబ్ధిదారులకు రాయితీ డబ్బులు జమ చేయాలి.

– భూక్యా చంద్రకళ, బస్వతారక కాలనీ

కేంద్రం డబ్బులే వస్తున్నాయి



మాకు ఉజ్వల గ్యాస్ కనెక్షన్ ఉంది. ఇప్పటివరకు కేంద్ర ప్రభుత్వం నుంచి వచ్చే రాయితీ డబ్బు మాత్రమే జమ అవుతోంది. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ రావడం లేదు.

– గుగులోతు సుమతి, జగన్నాథపురం

క్లుప్తంగా

పెండింగ్ పనులు పూర్తిచేయాలి



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న జిల్లా జడ్జి

ఇల్లెందు: ఇల్లెందు ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టులో గత ఐదు నెలలుగా పెండింగ్ ఉన్న అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా జడ్జి వసంత్ పాటిల్ కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం కోర్టును ఆయన సందర్శించగా.. స్థానిక న్యాయమూర్తి దేవరపల్లి కీర్తి చంద్రికరెడ్డి మొక్క అందజేసి ఘనంగా స్వాగతం పలికారు. బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన శాలువతో సత్కరించారు. అనంతరం న్యాయమూర్తి కోర్టులో రికార్డులను తనిఖీ చేశారు. కాగా, కోర్టులో శౌచాలయాలు ఏర్పాటు చేయాలని బార్ అసోసియేషన్ ఆధ్వర్యాన వినతి పత్రం అందజేశారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కె. ఉమామహేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కీర్తి కార్తీక్, సీనియర్ న్యాయవాదులు దంతాల ఆనంద్, పెద్దూరి నర్సయ్య, గోపీనాథ్, నారాయణ, బాలకృష్ణ, వెంకటేశ్వర్లు, రవికుమార్, ఎస్.సత్యనారాయణ, బన్సీలాల్ తదితరులు ఉన్నారు.

ఫ్యాక్టరీకి 'గెలల' తాకిడి..



ఆయిల్‌పామ్ గెలలతో బారులుదీరిన ట్రాక్టర్లు

దమ్మపేట: మండల పరిధిలోని అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీకి శనివారం ట్రాక్టర్లు బారులుదీరాయి. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు ఒక్కసారిగా ఫ్యాక్టరీకి చేరుకోగా.. ప్లాట్‌ఫాం అంతా గెలలతో నిండిపోయింది. ఈ క్రమంలో గెలలను ప్లాట్‌ఫాం కింద ఉన్న మరో డంపింగ్ కన్వేయర్ బెల్ట్ వద్ద దిగుమతి చేస్తున్నారు. ఫ్యాక్టరీకి గెలల తాకిడి పెరగడంతో దిగుమతికి గంటల సమయం పడుతుందని రైతులు చెబు న్నారు. దీనిపై ఫ్యాక్టరీ మేనేజర్ కల్యాణ్‌ను వివరణ కోరగా.. ఇటీవల కురిసిన వర్షాలతో గెలల కోత ఆపిన రైతులు.. వర్షం తగ్గడంతో గెలల కోత ప్రారంభించడంతో ఫ్యాక్టరీకి తాకిడి పెరిగిందన్నారు. రైతులను ఇబ్బంది పెట్టకుండా క్రమపద్ధతిలో దిగుమతి చేస్తున్నట్లు తెలిపారు.

నీటిని త్వరగా ఎత్తిపోయాలి



బొగ్గు ఉత్పత్తిని పరిశీలిస్తున్న అధికారులు

మణుగూరు టౌన్: బొగ్గు ఉత్పత్తికి ఆటంకంగా ఉన్న వర్షపు నీటిని ఉపరితల గనుల నుంచి త్వరితగతిన ఎత్తిపోయాలని డైరెక్టర్ (ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్) వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం మణుగూరు ఏరియాలో పర్యటించిన ఆయన తొలుత పగిడేరు జియోథర్మల్ విద్యుత్ ప్లాంట్‌ను సందర్శించారు. 20 కిలోవాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపునకు అవకాశాలు పరిశీలించాలని సంబంధిత అధికారులతో సమాలోచన చేశారు. అనంతరం పీకేఓసీ-4ను సందర్శించి మాట్లాడారు. సమష్టి కృషితో ఉత్పత్తి సాధనకు పనిగంటలు పూర్తిస్థాయిలో సద్వినియోగపరుచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏరియా జీఎం దుర్గం రాంచందర్, జీఎం(ఆర్అండ్‌డీ) కనకయ్య, జీఎం(ఎక్స్‌ప్లోరేషన్) శ్రీనివాస్, డీజీఎం(ఎక్స్‌ప్లోరేషన్) రాజ్‌కుమార్, డీజీఎం(ఆర్అండ్‌డీ) శ్రీనివాస్, అధికారులు శ్రీనివాసచారి, దయాకర్, బైరెడ్డి వెంకటేశ్వర్లు, సేఫ్టీ అధికారి భాస్కర్, శ్రీనివాస్, ఎస్టేట్స్ బాబుల్ రాజ్, ఎం.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

పత్తి ఎగుమతుల్లో నకిలీ దందా

ఖమ్మంవ్యవసాయం/ఖమ్మం క్రైం: పత్తి ఎగుమతుల్లో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ పరిధిలోని ఓ వ్యాపారి చేసిన నకిలీ దందా బయటపడింది. దీంతో ఆయనపై మార్కెట్ బాధ్యులు ఖమ్మం త్రీటౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. వివరాలు... పంట ఉత్పత్తులను కొనుగోలు చేసి ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే వ్యాపారులు మార్కెట్ నుంచి పర్మిట్లు పొందాలి. ఆ పర్మిట్ల ఆధారంగా ఎగుమతి చేస్తూ నిర్ణీత రుసుము మార్కెట్‌కు చెల్లించాల్సి ఉంటుంది. అయితే, 2023లో ఖమ్మంకు చెందిన మహాలక్ష్మి కాటన్ ట్రేడర్స్ యజమాని మన్నెం కృష్ణయ్యకు మార్కెట్ నుంచి రశీదు పుస్తకం జారీ చేశారు. ఇందులోని ఓచర్ల ద్వారా పత్తిని వివిధ రాష్ట్రాలకు ఎగుమతి చేశాడు. ఆంధ్రప్రదేశ్‌లోని ఓ కంపెనీకి కూడా 1,100 క్వింటాళ్ల పత్తిని ఎగుమతి చేయగా, వారు అనుమానం వచ్చి ఆరా తీయడంతో నకిలీ పర్మిట్‌గా తేలింది. ఇదికాక పలు ఓచర్లతో నకిలీ పర్మిట్ సృష్టించినట్లు తేలడంతో కృష్ణయ్యపై మార్కెట్ కార్యదర్శి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఖమ్మం త్రీటౌన్ సీఐ మోహన్‌బాబు తెలిపారు. ఈ పర్మిట్ల ఆధారంగా సదరు వ్యాపారి మార్కెట్‌కు రూ.1.50 లక్షల పన్ను చెల్లించాల్సి ఉన్నట్లు తేలగా.. మొత్తం ఎగుమతులను పరిశీలిస్తే ఇది పెరిగే అవకాశముందని సమాచారం. కాగా, చాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యాన ఈ విషయం బయటపడడం గమనార్హం.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.18,052

బురదే మిగిలింది..



గోదావరి వరదలకు దెబ్బతిన్న పత్తిచేను

గోదావరి వరదకు నీటమునిగిన పంటలు

- వేలఎకరాల్లో పంట నష్టం
- వరదపాలైన రైతు కష్టార్జితం
- పరిహారం అందించాలని వేడుకోలు
- అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన



దెబ్బతిన్న వరి చేను

బూర్గంపాడు: నిన్నటి వరకు పచ్చగా కళకళలాడిన పంటచేలు.. నేడు బురదతో నిండి నిలువునా మాడిపోతున్నాయి. రెండు నెలలు శ్రమించి పెంచుకున్న పంటలను గోదావరి వరదలు ముంచెత్తడంతో రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారు. గోదావరి పరీవాహక ప్రాంతంలో ఇటీవల వచ్చిన వరదలకు భద్రాచలం రెవెన్యూ డివిజన్‌లోని బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు, పినపాక, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో వేలాది ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఈ ఏడాది ఆగస్టు రెండో వారం వరకు ఓ మోస్తారు వర్షాలతో పడగా.. గోదావరి ప్రవాహం తక్కువగా ఉండడంతో పరీవాహక ప్రాంతాల రైతులు ముందుగానే పంటలు సాగు చేశారు. అయితే ఇటీవల కురిసిన భారీ వర్షాలకు గోదావరికి వరదలు రావడంతో పంటలు నీటమునిగి రైతులు తీవ్రంగా నష్టపోయారు.

దెబ్బతిన్న మెట్టపంటలు..

గోదావరి పరీవాహక ప్రాంతాల్లో రైతులు సాగు చేసిన పత్తి, వరి, కూరగాయల పంటలు వరదలకు దెబ్బతిన్నాయి. సుమారు 2వేల ఎకరాలలో పత్తి, 4 వేల ఎకరాలలో వరి నీటమునిగాయి. అయితే వరి పంటకు పెద్దగా నష్టం జరగకపోవచ్చని, మెట్ట పంటలు మాత్రం పూర్తిగా దెబ్బతింటాయని రైతులు పేర్కొంటున్నారు. నీటమునిగిన పత్తి చేలల్లో వరద తగ్గిన తరువాత ఆకులపై బురద చేరి మొక్కల నిలువునా ఎండుతున్నాయి.

ఎకరాకు రూ.25వేల ఖర్చు..

ఇప్పటి వరకు విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు, కూలీలకు ఎకరాకు రూ.25వేల వరకు ఖర్చు చేశామని, మరో రూ.15వేలు ఖర్చు చేస్తే పెట్టుబడులు పూర్తవుతాయని రైతులు అంటున్నారు. ఇప్పటికే పత్తిచేలు పూత, పిందెలతో పాటుగా కాయలతో ఏపుగా పెరుగుతున్నాయని, వరద పంటను పూర్తిగా తుడిచి పెట్టిందని వాపోతున్నారు. అదేవిధంగా ఇప్పుడిప్పుడే చేతికందుతున్న బెండ, దోస, బీర, సొర, గోరుచిక్కుడు వంటి కూరగాయల పంటలు వరదలో మునకేసి సుమారు 300 ఎకరాల్లో పూర్తిగా దెబ్బతిన్నాయని వాపోతున్నారు. జిల్లాలో సుమారు 3వేల ఎకరాలలో వరిపంట నీటమునగగా.. వరద 24 గంటల్లోనే తగ్గుముఖం పట్టడంతో పెద్దగా నష్టం ఉండదని చర్చసాగుతోంది. మరీ లోతట్టు ప్రాంతాల్లోని వరి పంట మాత్రం వరదకు నేలకొరిగి దెబ్బతింది. మిగతా ప్రాంతాల్లో నీట మునిగిన వరిపైరు వరద తగ్గిన తరువాత తేరుకుంటున్నట్లు రైతులు చెబుతున్నారు.

అధికారుల క్షేత్రస్థాయి పరిశీలన..

గోదావరి వరదలకు నీటమునిగిన పంటలను వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంటనష్టం అంచనా వేయాల్సి ఉంది. శుక్రవారం మండల వ్యవసాయశాఖ అధికారులు నీటి ముంపు తొలగిన చేలను పరిశీలించారు. వరద పూర్తిస్థాయిలో తగ్గిన తరువాత క్షేత్రస్థాయి పరిశీలన చేసి పంటనష్టం అంచనా వేసి నివేదికలను సిద్ధం చేస్తామని అధికారులు పేర్కొంటున్నారు. గతేడాది మాదిరిగా పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. పంట నష్టపోయిన రైతులకు రాయితీపై విత్తనాలు, ఎరువులు అందించాలని డిమాండ్ చేస్తున్నారు.

ఆరెకరాల్లో పంట నష్టపోయా..



గోదావరి వరదలకు నాలుగెకరా ల వరి మాగాణి, రెండెకరాల పత్తిచేను నీటమునిగింది. పత్తి చేను పూర్తిగా దెబ్బతింది. వరి మాగాణి ఒకట్రెండు రోజులు గడిస్తేగాని అక్కరకు వస్తుందో రాదో తెలుస్తుంది. వ్యవసాయశాఖ అధికారులు వరదలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించి రిపోర్టులను ప్రభుత్వానికి పంపించాలి. ప్రభుత్వం పరిహారమందించి రైతులను ఆదుకోవాలి.

– పాపుకొల్లు సుధాకరరావు, రైతు, నాగినేనిప్రోలు

క్షేత్రస్థాయి పరిశీలన..



గోదావరి వరద ముంపునకు గురైన పంటలను మండల వ్యవసాయశాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలిస్తున్నారు. నివేదికలు సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపిస్తాం. వరద ముంపు తగ్గాక పొలాల్లో నీటిని తీసివేసి ఆకులపై చేరిన ఒండ్రుమట్టిని స్ప్రేయర్లతో శుభ్రం చేసుకోవాలి. స్థానిక వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి.

– బి.తాతారావు, ఏడీఏ, మణుగూరు

రైతులను ఆదుకోవాలి..



రైతులతో మాట్లాడుతున్న సీపీఎం బృందం

బూర్గంపాడు: గోదావరి వరదలకు పంటనష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మచ్చ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం బూర్గంపాడు మండలంలోని రెడ్డిపాలెంలో గోదావరి వరదలకు దెబ్బతిన్న పంటచేలను సీపీఎంప్రతినిధి బృందం పరిశీలించి పంటనష్టం వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎకరాకు రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టి సాగుచేసిన పత్తి చేలు వరదకు పూర్తిగా దెబ్బతిన్నాయన్నారు. వ్యవసాయ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పంటనష్టంపై నివేదికలను ప్రభుత్వానికి పంపించాలని పంటనష్టపరిహారం అందేలా చేడాలన్నారు. లేనిపక్షంలో పార్టీ ఆధ్వర్యాన ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి బత్తుల వెంకటేశ్వర్లు, బయ్యా రాము, గుంటక కృష్ణ, ఎస్‌కె.అబీదా, కనకం వెంకటేశ్వర్లు, కొమర్రాజు సత్యనారాయణ, కమటం మరియమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన సాధించాలి



దుమ్ముగూడెం: ప్యాకింగ్ తీరును పరిశీలిస్తున్న అధికారులు

దుమ్ముగూడెం/అశ్వాపురం: మహిళలందరూ ఐకమత్యంతో స్వశక్తిగా కుటీర పరిశ్రమలు నెలకొల్పుకుని ఆర్థిక స్వావలంబన సాధించాలని ఐటీడీఏ సహాయ ప్రాజెక్టు అధికారి జనరల్ డేవిడ్ రాజ్ అన్నారు. శనివారం దుమ్ముగూడెం మండలం లక్ష్మీనగరంలోని గిరిజన చిక్కి యూనిట్‌ను, అశ్వాపురం మండలం తుమ్మలచెరువు గ్రామంలోని సమ్మక్క-సారక్క మహిళా కందిపప్పు ఉత్పత్తి కేంద్రాన్ని ఐటీసీ సంస్థ మేనేజర్ చెంగల్‌రావుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా పల్లీపట్టి, కందిపప్పు తయారీ విధానాలను తెలుసుకుని సరసమైన ధరల కోసం అమ్మకాలు జరిగేలా ఆకర్షణీయమైన డిజైనింగ్, ప్యాకింగ్ చేయించేలా ఐటీసీ ఆధ్వర్యాన కృషి చేస్తామన్నారు. ఏడుగురు గిరిజన మహిళలు రూ.24 లక్షల సబ్సిడీతో రూ.40 లక్షలతో ఏర్పాటు చేసుకున్న గిరిజన చిక్కి యూనిట్‌ను రూపొందించుకోవడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమాల్లో ఐటీసీ సంస్థ మేనేజర్ చెంగల్ రావు, ప్యాకింగ్ డిజైనింగ్ కోఆర్డినేటర్ బేగ్, రామ్ కుమార్, యూనిట్ మహిళలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో మహిళ మృతి



భూక్య గౌరీ(ఫైల్)

మణుగూరు టౌన్: మున్సిపాలిటీ పరిధి రాజుపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేసే మహిళ విద్యుదాఘాతంతో శనివారం మృతిచెందింది. మధ్యాహ్న భోజన ప్రైవేట్ వర్కర్‌గా పనిచేసే భూక్య గౌరీ (56) రోజు మాదిరిగానే మోటార్ స్విచ్ వేస్తుండగా.. విద్యుత్ ప్రసరించి షాక్‌కు గురై అపస్మారక స్థితిలోకి వెళ్లింది. దీంతో స్థానికులు ఆటోలో 100 పడకల ఆస్పత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కాగా, గౌరి కుటుంబానికి న్యాయం చేయాలనే డిమాండ్‌తో సీఐటీయూ నాయకులు ఆస్పత్రి ఎదుట ఆందోళన నిర్వహించారు. దీంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడగా పోలీసులు నచ్చచెప్పి ఆందోళన విరమింపజేశారు.అనంతరం సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఏ.జే.రమేశ్, యూని యన్ జిల్లా అధ్యక్షురాలు పద్మ తదితరులు ఎంఈఓ, ఎంపీడీఓలతో చర్చించగా.. మృతురాలి కుటుంబ సభ్యులకు ఉపాధి కల్పిస్తామని హామీ ఇవ్వడమే కాక హెచ్‌ఎం రూ.లక్ష పరిహారం ఇప్పించారు. నాయకులు బ్రహ్మాచారి, గద్దల శ్రీను, ఉప్పుతల నర్సింహారావు, సత్రపల్లి సాంబశివరావు, కాంతారావు, శైలజ, సారిక, పద్మ, భేగం పాల్గొన్నారు.

ఆటోలో నుంచి జారిపడి మహిళ..



సునీత(ఫైల్)

పాల్వంచరూరల్: ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి జారిపడి ఓ మహిళ మృతిచెందిన సంఘటన మండలంలోని జగన్నాథపురంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన యనగండ్ల హరీష్ భార్య సునీత (29) శుక్రవారం పాల్వంచ నుంచి ఆటోలో ఇంటికి వెళ్తోంది. ఈక్రమంలో జగన్నాథపురం గ్రామంలో మూలములుపు వద్ద ప్రమాదవశాత్తు ఆటోలో నుంచి జారిపడగా.. తీవ్రగాయాలు కావడంతో అదే ఆటోలో కొత్తగూడెంకు తరలించారు. పరీక్షించిన వైద్యులు వరంగల్‌కు రిఫర్ చేయగా.. మార్గం మధ్యలో మహబూబాబాద్ ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ శనివారం మృతి చెందింది. మృతురాలికి కుమారుడు, కుమార్తె ఉన్నారు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.



తోటకు చీర పైటేసినట్లు..

మండలంలోని నారాయణపురంగూడెం గ్రామ శివారులో ఓ రైతు బీర తోటను సాగు చేస్తున్నాడు. దీంతో పంటకు రక్షణగా మట్టుపాత చీరలను అడ్డుగా కట్టడంతో తోటకు చీర పైటేసినట్లుగా కనిపిస్తోంది. దాదాపు అర ఎకరం మేర పొలానికి పదుల సంఖ్యలో పాత చీరలను పెట్టడం, అవి రంగు రంగుల్లో ఉండడంతో ఆ మార్గంలో వెళ్లే వారిని ఆకట్టుకుంటున్నాయి. ఈ దృశ్యాన్ని శనివారం 'సాక్షి' తన కెమెరాలో బంధించింది. – అశ్వారావుపేటరూరల్

నాటు సారా స్వాధీనం



పట్టుబడిన నాటుసారా, నిందితులతో టాస్క్‌ఫోర్స్ బృందం

టేకులపల్లి: అక్రమంగా తయారు చేసి విక్రయిస్తున్న నాటు సారాను జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం స్వాధీనం చేసి ఇద్దరిపై కేసు నమోదు చేసింది. టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ గౌతమ్ కథనం ప్రకారం.. జిల్లా ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ బృందం శనివారం మండలంలోని సుక్కాల బోడు, రేగుల తండ, టేకులపల్లి, బొమ్మనపల్లి, సూర్యతండా, చంద్రుతండా గ్రామాల్లో అనుమానిత స్థావరాలు, నివాసాల్లో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో నాలుగు లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని ధారావత్ నాగరాజు, గుగ్గిల రవిలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. నాటుసారా తయారు చేయడం, విక్రయించడం నేరమని, ఎవరైనా విక్రయాలు జరిపితే ఎక్సైజ్ కానీ పోలీసు శాఖ అధికారులు, సిబ్బందికి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ దాడుల్లో సిబ్బంది రామక్రిష్ణ గౌడ్, వెంకటనారాయణ, సుమంత్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

భద్రాచలంఅర్బన్: భద్రాచలం పట్టణంలోని చర్ల రోడ్డులో గల ఏఎంసీ మార్కెట్‌లో గుర్తు తెలి య ని మృతదేహం లభ్యమైంది. టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చర్ల రోడ్డులో గల కొత్త మార్కెట్‌లో భిక్షాటన చేసుకుంటూ జీవిస్తున్న ఓ గుర్తుతెలియని వ్యక్తి ఏఎంసీ మార్కెట్ పరిధిలో గల దుకాణాల వద్ద ఉంటున్నాడు. ఈ నేపథ్యాన శనివారం మధ్యాహ్నం మార్కెట్ పరిసర ప్రాంతాల్లో దుర్వాసన వస్తుండడంతో స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇవ్వగా.. వారు శవాన్ని పరిశీలించి మృతుడి ఒంటిపై నల్లని నిక్కర్, గల్లతో కూడిన తెల్లని షర్ట్ ఉన్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం భద్రాచలం ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేశారు. ఆచూకీ తెలిస్తే భద్రాచలం టౌన్ పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.



వాగు దాటుతున్న వైద్య బృందం

వాగు దాటి.. వైద్యం అందించి..



గొత్తికోయ గ్రామంలో నిర్వహిస్తున్న వైద్య శిబిరం

ములకలపల్లి: స్థానిక మంగపేట పీహెచ్‌సీ వైద్య బృందం వాగులు, వంకలు దాటి వలస గొత్తికోయలకు వైద్య సేవలు అందించారు. తిమ్మంపేట సబ్ సెంటర్ పరిధిలోని మారుమూల వలస ఆదివాసీ గ్రామాలైన పాలవాగు, కొత్తగుండాలపాడు, పాతగుండాలపాడు, పాలవాగుల్లో స్థానిక వైద్యాధికారి కృష్ణదీపక్‌రెడ్డి ఆధ్వర్యాన శనివారం వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. రెండు కి.మీ కాలిబాటన వెళ్లి 90 మందికి వైద్య పరీక్షలు చేయగా.. 12 మంది జ్వరపీడితులను గుర్తించి మందులు అందించారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని, పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి తెలిపారు. సబ్‌యూనిట్ ఆఫీసర్ జేతూరామ్, ఎంటీఎస్ చైతన్య, హెచ్‌ఎస్‌లు శ్రీకృష్ణ, నాగమణి, ఎంఎల్‌హెచ్‌పీ స్పందన తదితరులు పాల్గొన్నారు.

నానో యూరియాతో మెరుగైన ఫలితాలు



నానో యూరియా పిచికారీని పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

ఇల్లెందురూరల్: నానో యూరియా వినియోగంతో రైతులకు మెరుగైన ఫలితాలు అందుతాయని ఏడీఏ లాల్‌చంద్ అన్నారు. మండలంలోని మాణిక్యారం, కొమరారం గ్రామపంచాయతీల్లో నానో యూరియా వినియోగం, పిచికారీ పద్ధతిపై రైతులకు శనివారం క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ.. నానో వినియోగం వల్ల రైతుకు పెట్టుబడి భారం తగ్గడంతోపాటు రవాణా ఖర్చులు కూడా తగ్గుతాయన్నారు. గుళికల రూపంలో ఉండే యూరియా కంటే ద్రవరూపంలో ఉన్న నానో యూరియా వినియోగంపై ఎంతో మేలని, దీనిపై రైతులు దృష్టి సారించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఓ సతీష్, పలువురు రైతులు పాల్గొన్నారు.

నేడు 2కే రన్

కొత్తగూడెంటౌన్: మేజర్ ధ్యాన్‌చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం 2కే రన్ నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి ఎం.పరంధామరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటలకు స్థానిక పోస్టాఫీస్ సెంటర్ నుంచి రైల్వే స్టేషన్ చేపట్టే ఈ రన్‌ఓ అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.